## ఎస్.ఐ.ఆర్. జాబితాను పకడ్బందిగా తయారు చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:** ఎస్.ఐ.ఆర్. ఓటర్ జాబితాను పకడ్బందిగా తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై జిల్లా కలెక్టర్ల తో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫిరెన్స్ లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్,

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 26 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 6


సింగరేణి నేలలో పుట్టిన ఓ తత్త్వమూర్తి, ప్రజల కోసం శ్వాసించిన ఓ నాయకుడు గుమ్మడి నర్సయ్య. అతని జీవిత, రాజకీయ యాత్ర అంతా కూడా విలువలతో కూడిన పార్యగ్రంథం లాంటిది. ప్రజా రాజకీయాల సత్యాన్ని తన జీవన విధానంతో రాసిన ఆ మనిషి.. ఇప్పుడు వెండి తెరపై సజీవమవబోతున్నాడు. గుమ్మడి నర్సయ్య పేరుతోనే ఆయన జీవితం ఆధారంగా ఓ పాన్ ఇండియా సినిమా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రజా నాయకత్వానికి మార్గదర్శకుడైన ఈ మనిషి కథ, నేటి యువతకు రాజకీయ నీతికి పాఠం అవుతుందనే ఆశతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (మాలోత్ అశోక్), ప్రజాజ్యోతి

3 లో..

- సింగరేణి నేలలో పుట్టిన ప్రజా తత్త్వమూర్తి..
- పదవులు కాదు — ప్రజా ధర్మమే జీవన సత్యం
- బస్సు, ఆటోలో అసెంబ్లీకి వెళ్లిన ఎమ్మెల్యే కథ
- జీతమంతా పార్టీకే.. ఆస్తుల్లేని నాయకుడు
- విలువలతో నిండిన రాజకీయ జీవితం వెండి తెరపైకి..
- గుమ్మడి నర్సయ్య జీవితం.. నేటి యువతకు ప్రజా నీతి పాఠం

# విలువల పార్యగ్రంథం





## ప్రతి కుటుంబానికి అండగా ప్రభుత్వం



**ఇల్లందు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 44 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. 44.51 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అది కుటుంబం ఆర్థికంగా

మిగతా 2 లో...



## రామాలయంలో పరిపాలనపై అయోమయం

- షాడో వ్యక్తుల అజమాయిషీపై భక్తుల ఆగ్రహం
- ఎస్పీఎఫ్ సిబ్బంది ఘటనపై ఇంటెలిజెన్స్ వర్గాల విచారణ
- వివాదాస్పద కాంట్రాక్టర్ మళ్లీ రంగప్రవేశం

**భద్రాచలం, అక్టోబర్ 24,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఇటీవల పరిపాలన వ్యవహారాల తీరు పట్ల రామభక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానంలో బాధ్యతలు నిర్వర్తించే కీలక అధికారుల స్థానంలో కొందరు “షాడో వ్యక్తులు” ప్రభావం చూపుతూ నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. వీరి ఆధీనంలో జరుగుతున్న పరిపాలనా చర్యలు ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం చోటుచేసుకున్న ఎస్పీఎఫ్ సిబ్బందికి సంబంధించిన ఘటన ఆలయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేసింది. ఈ ఘటనపై ఇంటెలిజెన్స్ విభాగం ప్రత్యేకంగా సమాచారం సేకరిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలుపుతున్నాయి. దేవస్థానంలో పారదర్శకత లోపించడం, అనుచిత నిర్ణయాలు తీసుకోవడం, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కొందరి ఆధిపత్యం పెరుగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. భక్తుల ప్రకారం,

మిగతా 2 లో...

## ప్రతి కుటుంబానికి అండగా ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి...)
ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో కొలువు తీరిన ఇందిరమ్మ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదల వల్ల సంక్షేమ పథకాలు ప్రజలకు దరి చేరడంలో జాప్యం అయ్యాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ పార్టీ తరపున ఫోటోకాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే వారిని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కోట రవికుమార్, ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూయ, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, నాయకులు మడుగు సాంబమూర్తి, దొడ్డ డానియల్, పులి సైదులు, జాఫర్, కిరణ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. జాబితాను పకడ్బందిగా తయారు చేయాలి






(మొదటి పేజీ తరువాయి...)
అధనపు కలెక్టర్ డి వేణుగోపాల్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. నిర్వహణ కోసం చేపట్టిన ప్రిపరేటరీ కార్యాచరణలో పురోగతి ఉండాలని, 2002 లో చేసిన ఎస్.ఐ.ఆర్. తో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియను బూత్ స్థాయి అధికారుల సహకారం తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్. నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్. డేటాను 2025 ఎస్.ఐ.ఆర్. డేటా తో కంపేర్ చేసుకోవాలని, ఈ రెండు జాబితాలో కామన్ గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ లో భాగంగా క్యాటగిరి 'ఏ' ని బి.ఎల్.ఓ. యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరి సి, డి లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. ఈ.ఆర్.ఓ. కార్యాలయంలో ఇద్దరు బూత్ స్థాయి అధికారులను ప్రత్యేకంగా కేటాయించి శనివారం నాటికి మ్యాపింగ్ పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎలక్షన్ సెల్ సూపరడెంట్ రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో పరిపాలనపై అయోమయం

(మొదటి పేజీ తరువాయి...)
వీఐపీ క్యూలైన్ల వద్ద కాంట్రాక్ట్ సిబ్బంది భక్తులపై దురుసుగా ప్రవర్తించడం, తమ పరిచయాలు ఉన్న వారికి మాత్ర మే ప్రాధాన్యత ఇవ్వడం తరచూ జరుగుతోందట. ఈ అంశంపై పలు భక్తు లు ఇప్పటికే దేవస్థాన ఈవో దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పరిస్థితిలో మా ర్పు కనిపించడం లేదని తెలిపారు. ప్రోటోకాల్ విభాగంలో పనిచేస్తున్న ఓ యువకుడు తన పరిధిని దాటి నిర్ణ యాలు తీసుకుంటూ భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కూడా ఆరోపణ లు ఉన్నాయి. ఇటీవల జరిగిన అంతర్గత బదిలీలలో కూడా కొందరి ప్రభావం స్పష్టంగా కనిపించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులను పక్కన బెట్టి, కాం ట్రాక్ట్ ఉద్యోగులను ఆర్థిక విభాగాల వంటి కీలక బాధ్యతలకూ నియమించడం భక్తుల్లో అసంతృప్తికి దారితీస్తోం ది. ఇది దేవస్థాన పరిపాలనా వ్యవస్థలో అసమతౌల్యం సృష్టించిందని ఉద్యోగ వర్గాలే అంటున్నారు. అలాగే, ఆలయంలో వర్గ పోరు తీవ్ర రూపం దాల్చినట్టు తెలుస్తోంది. అధికార పార్టీకి సమీపంగా ఉన్న కొందరు వ్యక్తులు ఆలయ వ్యవహారాలలో జో క్యం చేసుకుంటూ సాధారణ భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ పవిత్రతకు భంగం కలిగించే ఇలాంటి ప్రవర్తనపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, గతంలో వివాదాస్పదంగా నిలిచిన ఓ కాంట్రాక్టర్ ఈవో రమాదేవి బదిలీ అయిన తరువాత మళ్లీ దేవస్థాన కార్యకలాపాల్లో హడావుడి చేస్తున్నట్లు సమాచారం. గురువారం సదరు కాంట్రాక్టర్ ఎస్పీఎఫ్ సిబ్బందితో వాగ్వివాదానికి దిగడంతో, ఆలయంలో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సంఘటనపై ఎస్పీఎఫ్ డీఎస్పీకి భక్తులు ఫిర్యాదు చేయడంతో దేవస్థాన అధికారులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ప్రస్తుతం దేవాదాయశాఖ పర్యవేక్షణలో ఉన్న ఉన్నతాధికారికి పరిపాలనా పట్టు లేకపోవడం వల్ల, కొందరు సీనియర్ ఉద్యోగులు తమ ప్రభావం చూపిస్తూ నిర్ణ యాలు తీసుకుంటున్నారని, దీనివల్ల దేవస్థానం పరిపాలన గందరగోళం లో పడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రామాలయం లాంటి పవిత్ర క్షేత్రంలో పారదర్శకత, శాంతి, భక్తుల సేవ ప్రధాన లక్ష్యంగా ఉండాలని భక్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, దేవాదాయశాఖ తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రామభక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రైవేట్ బస్సులపై ఆకస్మిక తనిఖీలు

- – నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎంవీఐ వెంకటపుల్లయ్య హెచ్చరిక



**భద్రాచలం, అక్టోబర్ 25,ప్రజాజ్యోతి :** కర్నూలు బస్సు దుర్ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా, భద్రాచలంలో శనివారం మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) వెంకటపుల్లయ్య ఆధ్వర్యంలో ప్రైవేట్ బస్సులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని బస్టాండ్ పరిసరాలు, ప్రధాన రహదారుల వద్ద నిలిపి ఉన్న పలు ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, రూట్ పర్మిట్, ఇన్సూరెన్స్ పత్రాలు, అగ్ని ప్రమాదాల సమయంలో అవసరమయ్యే భద్రతా పరికరాల లభ్యతను పరిశీలించారు. అలాగే బస్సుల సీటింగ్ సామర్థ్యానికి మించి ప్రయాణీకులను అనుమతిస్తున్నారా అనే అంశాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. పలు బస్సుల్లో స్వల్ప లోపాలు గుర్తించడంతో, సంబంధిత యజమానులకు వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఎంవీఐ వెంకటపుల్లయ్య మాట్లాడుతూ, "సామర్థ్యానికి మించి ప్రయాణీకులను అనుమతించినా, అవసరమైన పత్రాలు లేకుండా బస్సులు నడిపినా, అధిక చార్జీలు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ప్రాణ భద్రతే మాకు ప్రాధాన్యం. ప్రయాణీకులు కూడా ఎప్పుడూ ఫిట్ నెస్, భద్రతా ప్రమాణాలు కలిగిన వాహనాల్లోనే ప్రయాణించాలి," అని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ఎంవీఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాన్స్పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి తనిఖీలు రాబోయే రోజుల్లో కూడా కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు.

## పోలీస్ అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలి



**ఇల్లందు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:** విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇల్లందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21 నుండి వారం రోజులపాటు పోలీస్ అమరవీరుల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐలు సూర్య, హసీనా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తి ప్రపత్తులతో ఘనంగా నాగుల చవితి వేడుకలు



**భద్రాచలం, అక్టోబర్ 25,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో నాగుల చవితి వేడుకలను శనివారం భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే భక్తులు ఇళ్లలో నాగదేవతలకు పూజలు, నైవేద్యాలు సమర్పించారు. సాంప్రదాయ పద్ధతిలో స్త్రీ పురుషులు ఉపవాసం పాటించి, శ్రద్ధతో నాగదేవతలను ఆరాధించారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం, మార్కెట్ కమిటీ పరిసరాలు, జూనియర్ కళాశాల క్రీడా మైదానం, ట్రాన్స్కో కార్యాలయం, ఐటీసీ సమీపంలోని పాముల పుట్టల వద్ద భక్తులు పాలు, పంచామృతం పోసి పూజలు చేశారు. కొంతమంది భక్తులు నాగదేవతలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, మరి కొందరు శివాలయాలను సందర్శించి శివలింగానికి పాలు, చందనం, పుష్పాలతో అభిషేకం చేశారు. సాయంత్రం సమయంలో పట్టణంలోని ప్రధాన శివాలయాల్లో దీపారాధన ఘనంగా నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై హారతులు ఇస్తూ "నాగదేవతా శరణం" అంటూ భక్తి భావంతో ప్రార్థనలు చేశారు. నాగదేవతల ఆరాధన వల్ల సర్పదోషాలు నివారణ అవుతాయని, కుటుంబంలో ఆరోగ్యం, ఐశ్వర్యం పెరుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. పిల్లలకు నాగదేవతల పట్ల భక్తి, ప్రకృతి పట్ల గౌరవం పెంచే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారికి నాగపూజా మహిమను వివరించారు. వేడుకల సందర్భంగా పాముల పుట్టల వద్ద పోలీసు సిబ్బంది, అటవీ అధికారులు భక్తులకు సహకరించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలు ముగిశాయి

**విజ్ఞప్తి**

డాక్యుమెంట్ నెంబర్: 2784/2020 ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నాపేరు మీద రిజిస్టర్ అయిన, గొపాయి పాలెం గ్రామం, తిరుమలాయపాలెం మండల పరిధిలోని 266 చ.గజాల ఇంటి స్థలానికి సంబంధించిన విక్రయ దస్తావేజు (తేదీ: 02-10-2025) జిరాక్స్ కోసం పాల్వంచ బస్ స్టాండ్ ప్రాంతానికి వెళ్లినప్పుడు ఎక్కడో పడిపోయినది. ఈ సందర్భంగా సంబంధిత పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడా నమోదు చేయబడినది. ఈ డాక్యుమెంట్ దొరికిన వారు దయచేసి క్రింద తెలిపిన నంబర్ కు తెలియజేయ గలరు అని మనవి.

**కాశిపోయినది: శీరీష**

**సంప్రదించవలసిన నంబర్: 79892 98432**

# విలువల పాఠ్యగ్రంథం




**సింగరేణి నేలలో పుట్టిన ఓ తత్త్వమూర్తి, ప్రజల కోసం శ్వాసించిన ఓ నాయకుడు గుమ్మడి నర్సయ్య. అతని జీవిత, రాజకీయ యాత్ర అంతా కూడా విలువలతో కూడిన పాఠ్యగ్రంథం లాంటిది. ప్రజా రాజకీయాల సత్యాన్ని తన జీవన విధానంతో రాసిన ఆ మనిషి.. ఇప్పుడు వెండి తెరపై సజీవమవబోతున్నాడు. గుమ్మడి నర్సయ్య పేరుతోనే ఆయన జీవితం ఆధారంగా ఓ పాన్ ఇండియా సినిమా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రజా నాయకత్వానికి మార్గదర్శకుడైన ఈ మనిషి కథ, నేటి యువతకు రాజకీయ నీతికి పాఠం అవుతుందనే ఆశతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.**

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (మాలోత్ అశోక్), ప్రజాజ్యోతి

సింగరేణి నేలలో పుట్టిన ఓ తత్త్వమూర్తి, ప్రజల కోసం శ్వాసించిన ఓ నాయకుడు గుమ్మడి నర్సయ్య. అతని జీవిత, రాజకీయ యాత్ర అంతా కూడా విలువలతో కూడిన పాఠ్యగ్రంథం లాంటిది. ప్రజా రాజకీయాల సత్యాన్ని తన జీవన విధానంతో రాసిన ఆ మనిషి.. ఇప్పుడు వెండి తెరపై సజీవమవబోతున్నాడు. గుమ్మడి నర్సయ్య పేరుతోనే ఆయన జీవితం ఆధారంగా ఓ పాన్ ఇండియా సినిమా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రజా నాయకత్వానికి మార్గదర్శకుడైన ఈ మనిషి కథ, నేటి యువతకు రాజకీయ నీతికి పాఠం అవుతుందనే ఆశతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రజా పోరాటాలతో, త్యాగాలతో నిండిన ఆతని జీవన గాథను తెరపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నిర్మాత నల్లా సురేష్‌రెడ్డి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. దానితో పాటు ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించబోతున్నారని తెలిసిన క్షణం నుంచే సినీ ప్రపంచంలో ఆసక్తి మరింత పెరిగింది.

## • మట్టి వాసనతో పుట్టిన మనిషి..



భద్రాద్రి నేల గర్వకారణమైన ప్రజా నాయకుడు గుమ్మడి నర్సయ్య.. 1955లో అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో జన్మించారు. పేదరికం, కష్టసాధ్య జీవన పరిస్థితుల్లో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే శ్రమను, నిజాయితీని తన బలం చేసుకున్నారు. 'ప్రజల బాధనే నా పాఠశాల' అని చెప్పుకునే ఆయన, జీవితం అంతా పేదల కోసం, కూలీల కోసం అంకితం చేశారు. కమ్యూనిస్టు భావజాలానికి ప్రతీకగా, పేదల నేస్తంగా, రైతు కూలీల హక్కుల రక్షకుడిగా ఆయన నిలిచారు. దీంతో నరసయ్య పేరు తెలంగాణ సరిహద్దులను దాటి, దక్షిణ భారత ప్రజా ఉద్యమాల్లో గౌరవప్రద స్థానం




పొందింది. అలాంటి వ్యక్తిత్వాన్ని తెరపై చూపడం ఒక సవాలు అనిపించినా, దర్శకబృందం ఆ బాధ్యతను గౌరవంగా తీసుకుంది. డాక్టర్ శివరాజ్ కుమార్ వంటి నటుడు ఆ పాత్రకు రూపం ఇస్తుండటంతో సినిమాకు జాతీయ స్థాయి ప్రాధాన్యం ఏర్పడింది.

## • ప్రజా పోరాటం నుండి శాసనసభ దాకా...

సిపిఐ (ఎంఎల్–న్యూ డెమోక్రసీ) పార్టీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక శాసనసభ సభ్యుడు గుమ్మడి నర్సయ్య. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన ఈ పార్టీ, కాలం మారుతున్న తీరు గుర్తించి, 1983లో తొలిసారిగా ఇల్లెందు నియోజకవర్గం నుండి పోటీ చేసింది. ఆ నిర్ణయాన్ని గౌరవిస్తూ నర్సయ్య పోటీ చేసి ఐదు సార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 1983–1994, 1999–2009 మధ్యకాలంలో ఆయన ప్రజల విశ్వాసంతో ఎమ్మెల్యేగా నిలిచారు. పదవులు కాదు, ప్రజా ధర్మమే పెద్దదిగా భావించే ఆయన నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. అసెంబ్లీ సమావేశాలకు హైదరాబాద్ వెళ్లే ప్రతిసారి బస్సు, ట్రైన్ లో ప్రయాణించి, విద్యానగర్ లోని పార్టీ కార్యాలయంలో భోజనం చేసి, ఆటోలో అక్కడికి చేరుకునేవారు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారం కోసం అయన ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. గెలిచిన ఐదు సార్ల జీతమంతా పార్టీకే సమర్పించారు. కొద్దిపాటి పొలం తప్ప సొంత ఆస్తి ఏదీ లేకుండా న్యాయమైన రాజకీయం చెయ్యడంతో.. అయన జీవితం విలువలతో నిండిన రాజకీయ పాఠ్యగ్రంథంలా నిలిచిపోయింది.

## • సినిమా రూపంలో విలువల గాథ..

ప్రచారాన్ని ఎప్పుడూ దూరం పెట్టిన ఆయన, ప్రజల పిలుపుకు మాత్రం ఎప్పుడూ ముందుండేవారు. అందుకే ఆయన చివరి ఎన్నికల ఓటమి కూడా ప్రజాస్వామ్యంలో "గెలుపు కంటే నిలకడే విజయం" అనే సందేశంగా నిలిచిపోయింది. అయితే ఈ సినిమా కథనం నర్సయ్య బాల్యం నుంచి ఆయన రాజకీయ పయనానికి అద్దం పడుతుంది. అతని ప్రేమ, దాంపత్యం, ప్రజా పోరాటం, కార్పొరేట్ రాజకీయాల దుష్ప్రభావం – ఇవన్నీ ఈ చిత్రంలో ప్రతిబింబించబోతున్నాయి. చిత్రీకరణ భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం, సుజాతనగర్ ప్రాంతాలతో పాటు రామోజీ ఫిల్మ్ సిటీ, తెలంగాణ అసెంబ్లీలో కూడా జరగనుంది. దీంతో పల్లెటూరి వాతావరణం, గనుల ప్రాంతాల



సత్యరూప దృశ్యాలు, స్థానిక భాషా స్వరాలు.. ఇవన్నీ సినిమాకు వాస్తవికతను తెచ్చిపెట్టనున్నాయి.

## • విలువలను తెరపైకి తెచ్చే బృందం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువ నిర్మాత నల్లా సురేష్‌రెడ్డి ప్రవల్లి ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ పైన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకత్వం మహారాష్ట్రకు చెందిన పరమేశ్వర్ యూరాలే వహిస్తున్నారు. గత నాలుగేళ్లుగా గుమ్మడి నర్సయ్య జీవితాన్ని, ఆయన రాజకీయ, ప్రజా పోరాటాలను లోతుగా అధ్యయనం చేసి ఈ కథను స్క్రిప్ట్ రూపంలో మలిచారు. ఈ చిత్రానికి విరాటపర్వం ఫేమ్ సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు. ప్రధాన పాత్రలో కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ నటించనున్నారు. ఆయన ఈ పాత్ర కోసం ఎటువంటి రెమ్యూనరేషన్ తీసుకోకుండా..



"ఇది కేవలం పాత్ర కాదు... ప్రజా సత్యాన్ని చెప్పే బాధ్యత" అని చెబుతూ ముందుకొచ్చారు అని చిత్ర బృందం తెలిపింది. అంతేకాక, మమ్ముట్టి, జగపతిబాబు, సోనూసూద్, ప్రియమణి వంటి ప్రముఖ తారలు కూడా ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది ఏప్రిల్ లో ఒకే సారి 5 భాషల్లో విడుదల చేసేందుకు ప్రణాళిక చేస్తున్నారు. ఇప్పటికే ఈనెల 22న విడుదలైన మోషన్ టీజర్ నెట్టింట్లో వైరల్ అవుతుంది. దీనిపై యువత, రాజకీయ నేతలు, సినిమా వర్గం అభినందనల వెలువలు తెలుపుతున్నాయి. దీంతో ఈ మూవీ పై మరింత బజ్ పెరిగింది. ఇలా రాజకీయ విలువలతో నిండిన ఓ మనిషి జీవితం, జాతీయ స్థాయి నటీనటులతో కలిసిపోతూ.. ఓ ప్రజాస్ఫూర్తి చిత్రంగా గుమ్మడి నర్సయ్య రూపుదిద్దుకుంటోంది.



## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు



**టేకులపల్లి,అక్టోబర్25,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలో చుట్టుపక్కల గ్రామాలలో నాగుల చవితి వేడుకలు ఘనంగా శనివారం జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి పుట్టలో పాలు పోసి తమ భక్తిని చాటు కున్నారు.అనంతరం నైవేద్యంగా సమర్పించిన ప్రసాదాలను భక్తులు పలువురికి అందజేశారు.మహిళలు నాగుల చవితి వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ కార్య క్రమంలో మహిళలు సుబ్బమ్మ, లక్ష్మి,కలమ్మ,నాగమణి, స్వప్న, సంధ్య,రాజ్యలక్ష్మి,శాలిని,సుజాత తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం బీసీ రిజర్వేషన్ సాధించే వరకు పోరాడుదాం

- మండల బీసీ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ లక్కినేని సురేందర్ రావు



**టేకులపల్లి,అక్టోబర్25,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేంతవరకు ఉద్యమాలతో, పోరాటాలతో 42 శాతం రిజర్వేషన్ సాధించుకుందామని టేకులపల్లి మండల బీసీ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ లక్కినేని సురేందర్రావు పిలుపునిచ్చారు. టేకులపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద 42శాతం బీసీ రిజర్వేషన్ కోసం బీసీ కుల సంఘాల ఐక్యవేదిక సమావేశం శనివారం నిర్వహించి,మండల బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాలలో తిరిగి బీసీ రిజర్వేషన్ కోసం అందరిని కలుపుకొని పోరాటాన్ని ఉధృతంగా చేయాలన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ను అమలు చేసేదాకా పోరాడాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. పార్లమెంట్లో బీసీ బిల్లు ఆమోదం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. దేశంలో ఎవరు రాజ్యా ధికారంలోకి రావాలన్నా అత్యధికంగా ఉన్న బీసీలే కారణమని చెప్పారు.

## యాంటీ డ్రగ్స్ రాష్ట్రం కోసం సహకరించాలి







**ఇల్లందు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:** యాంటీ డ్రగ్స్ రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని యాంటీ డ్రగ్స్, ఇంపాక్ట్ ట్రైనర్ శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక జూనియర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. మద్యపానానికి, డ్రగ్స్ కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును ఉన్నత స్థాయిలో తీర్చి దిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామ లింగేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తోర్తి జాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాలం ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పామాయిల్ రైతాంగానికి గౌరవం - రైతు నేస్తం అవార్డుతో ఆలపాటికి సత్కారం

- ఆదివారం శ్రీ వెంకయ్య నాయుడు చేతుల మీదుగా రైతు నేస్తం అవార్డు అందుకోనున్న ఆలపాటి



**దమ్మపేట, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ ఆదివారం ప్రతిష్టాత్మక రైతు నేస్తం అవార్డు★ను అందుకోనున్నారు. స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న ప్రముఖులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. రైతుల తరఫున ఈ గౌరవం ఆలపాటికి దక్కడం విశేషం. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత అభిమానిగా ఉండే ఆలపాటి, తెలంగాణలో పామాయిల్ విస్తరణ కోసం మంత్రి తుమ్మలతో కలిసి నిరంతరం కృషి చేస్తున్నారు. పామ్ ఆయిల్ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ఆయన అనేకసార్లు రాష్ట్ర, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రులను కలిశారు.ఇటీవల పామాయిల్ సాగుపై అధ్యయనం కోసం మలేషియాకు వెళ్లిన ప్రతినిధి బృందంలో కూడా ఆలపాటి రామచంద్ర ప్రసాద్ ఉన్నారు. స్వతహాగా పామ్ ఆయిల్ రైతుగా, ఆ పంటపై పూర్తి అవగాహన కలిగి ఉన్న ఆయనకు రైతు నేస్తం అవార్డు దక్కడం పామాయిల్ రైతాంగానికి గర్వకారణం. ఈ అవార్డును మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్లోని స్వర్ణ భారతి ట్రస్ట్ ప్రాంగణంలో అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొననున్నారు.దమ్మపేట మండలానికి చెందిన ఆలపాటి అవార్డు పొందుతున్న సందర్భంగా, పామాయిల్ రైతులు అధిక సంఖ్యలో ఆదివారం హైదరాబాద్కు చేరుకోనున్నారు.

## ఇన్ఫార్మర్ నెపంతో ఇద్దరు గ్రామస్తుల హత్య





**చర్ల, అక్టోబర్ 25:(ప్రజా జ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లాలో నక్సలైట్లు ఇద్దరు గ్రామస్తులను పదునైన ఆయుధాలతో దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన గ్రామస్తులలో భయానక వాతావరణాన్ని సృష్టించింది. బీజాపూర్ జిల్లాలోని ఉసుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేలకంకర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది.నివేదికల ప్రకారం అక్టోబర్ 24వ తేదీ శుక్రవారం రాత్రి నక్సలైట్లు ఈ దాడికి పాల్పడ్డారు. నక్సలైట్లు ఇద్దరు యువకులను వారి ఇంటి నుండి బయటకు తీసుకునివచ్చి ఆపై పదునైన ఆయుధాలతో చంపారు. మృతులను రవి కట్టం (25), తిరుపతి సోధి (38)గా గుర్తించారు. రవి కట్టం సోదరుడు సిఆర్ పిఎఫ్ సైనికుడు. మృతి చెందిన ఇద్దరు ఒకే గ్రామానికి చెందిన వారు .సమాచారం అందిన వెంటనే పోలీసులు భద్రతా దళాల బృందం సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నక్సలైట్లను పట్టుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అని అదరపు పోలీసు సూపరిండెంట్ చంద్రకాంత్ గోవర్ణ తెలియజేశారు.

## అంబేద్కర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా..

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్,అక్టోబర్25,(ప్రజాజ్యోతి):** మండల కేంద్రమైన బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీకి చెందిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు 228 బూత్ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ కాలంలోని సమస్యలను పరిష్కరిస్తానని కావలసిన సీసీ రోడ్లు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. కిన్నెరసాని రహదారికి నూతన రోడ్డు ఏర్పాటు చేస్తానని ఆయన అన్నారు. కాలనీలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు 228 బూత్ కన్వీనర్ అలవాల దుర్గాప్రసాద్, కో కన్వీనర్ నందిపాటి వెంకటేశ్వర్లు,బూత్ ఇంచార్జ్ కేసుపాక రాజేష్, పెరుమాళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సాగు చట్టాలపై అవగాహన కార్యక్రమం



**చర్ల, అక్టోబర్ 25:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం భద్రాచలం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ కం,జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ ఆదేశాలతో యువ న్యాయవాది పరిటాల సంతోష్‌కుమార్ చర్ల మండలంలోని తేగడ, గొమ్ముగూడెం, గ్రామాలలోని రైతులను కలిసి వారికి సాగు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దుక్కి దున్నే నాటి నుంచి పండించిన పంటను మార్కెట్లో అమ్మేదాకా వ్యవసాయానికి సంబంధించిన పలు చట్టాలు నియమాలు అమలులో ఉన్నాయని ఆయన అన్నారు. రైతులకు భూమి సమస్య ఉత్పన్నమైనప్పుడు నాణ్యతలేని ఎరువులు నకిలీ పురుగు మందుల వల్ల నష్టం వాటిలినప్పుడు పంటల బీమా అందనప్పుడు మార్కెట్లో మోసం జరిగినప్పుడు ఇలా పలు సందర్భాలలో రైతులకు సాగు చట్టాలు అవసరమవుతాయని ఆయన రైతులకు అవగాహన కలిగించారు. రైతులందరూ సాగు చట్టాలను తెలుసుకొని వాటిని వినియోగించుకోగలిగితే సాగు సాఫీగా సాగుతుందని సమస్య వచ్చినప్పుడు పరిష్కారం చేసుకోవడానికి రైతు చట్టాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన రైతులకు వివరించారు.ఈ ఈ కార్యక్రమంలో మద్ది లక్ష్మీనరసింహారెడ్డి గోగికార్ రామలక్ష్మణ్ ముసలి సతీష్ లంకల సాయిరాం రైతులు మహిళా రైతులు పాల్గొన్నారు.



# పాఠశాలకు స్పోర్ట్స్ డ్రెస్ వితరణ




**ఇల్లందు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:** మండలంలోని యంపిపిఎస్ ముత్తారపుకట్ట పాఠశాలకు శనివారం స్పోర్ట్స్ డ్రెస్ ను కాయం రామకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకురాలు ట్రస్ట్ నిర్వాహకులు దొడ్డ అరుణ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యంపిపిఎస్ ముత్తారపుకట్ట పాఠశాల 39 మంది విద్యార్థులకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. మారుమూల ఆదివాసీ గూడెంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ముత్తారపుకట్ట పాఠశాల ఉపాధ్యాయులు తమ ట్రస్ట్ ను సంప్రందించగానే పిల్లలకు స్పోర్ట్స్ డ్రెస్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అనంతరం ఖమ్మం పీజీ కాలేజీ ఆంగ్లం ప్రొఫెసర్ ఆరెం నర్సమ్మ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించుకోవాలని చదువే మన జీవితాలను మన తలరాతలు మారుస్తుందన్నారు. కాయం రామకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక సేవకార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ యం కబ్బాకుల రవి, ఉపాధ్యాయులు అరెం రవికుమార్, పిఏసిఎస్ డైరెక్టర్ కిన్నెర నర్సయ్య, ముత్తారపుకట్ట మాజీ సర్పంచ్ మంకిడి కృష్ణ, రొంపేడు మాజీ సర్పంచ్ సూర్నబాక రామ్మూర్తి, కల్తీ బుచ్చిరాములు, కిన్నెర ప్రత్యూష, కాయం రామకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ అడ్వైసర్ కాయం భవాని, ట్రస్ట్ దొడ్డ వెంకటేశ్వర్లు, సభ్యులు పడిగ హైమావతి, కణితి భవాని, పూనెం విజయం ఎస్ యంసి చైర్మన్ కుంజ కృష్ణవేణి రాంబాబు, ఏఏపిసి చైర్మన్ యిర్ప యశోద, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు ఈసం అంజమ్మ, తల్లిదండ్రులు మల్లేష్ కుమార్, సూర్ణభాక సంధ్యారాణి, పవిత్ర, విజయకుమారి, యశోద, అశ్విని, రోజా, అలివేని, రాధ, సమ్మక్క, వసంత, రవి, సారయ్య, గోపాల్, రజిత, శ్రీలత, వెంకట్, లక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**చర్ల, అక్టోబర్ 25: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం కుదునూరు గ్రామానికి చెందిన బుడగం నవీన్ కు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ చెక్కు తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ద్వారా మంజూరై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ చేతుల మీదుగా లబ్ధిదారుడికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సుందరి సురేష్, విజయ్ నాయుడు, పొగళ్ల రాము, సత్తిబాబు, కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ రూంజా రాజా తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వనమా గాంధీ



**అన్నపురెడ్డిపల్లి,అక్టోబర్ 25,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అధికారులను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తహసిల్దార్‌గా బాధ్యతలు ప్రారంభించిన గంట ప్రతాప్ మరియు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా నియమితులైన విజయసింహారెడ్డిలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వనమా గాంధీ, ఆర్యవైశ్య సభ్యులతో కలిసి వారి కార్యాలయాల్లో శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు జంగాల శ్రీనివాసరావు, దోసపాడు శంకర్రావు, వనమా శీను, వేముల నగేష్, కొత్తగూళ్ల సీతయ్య, గోళ్ళ పుల్లారావు, దారా ప్రదీప్ కృష్ణ, కొత్తగూళ్ల మహేష్, వేముల రాకేష్, గుండాల సునీల్, యాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు



**దమ్మపేట, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలం, అంకంపాలెం గ్రామానికి చెందిన కాకా శ్రీనివాసరావు – వరలక్ష్మి దంపతుల కుమార్తె లయ వివాహం శనివారం ఘనంగా జరిగింది. నూతన వధూవరులు లయ – రవి కుమార్ దంపతులను దమ్మపేట మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, వారితో పాటు స్థానికులు ప్రభాకర్, రమేష్, మాజీ సర్పంచ్ గురుమూర్తి, మాజీ సర్పంచ్ కాకా అనూష భరత్, మాజీ ఎంపీటీసీ సోడెం గంగరాజు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



**అన్నపురెడ్డిపల్లి,అక్టోబర్ 25, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో నాగుల చవితి సందర్భంగా భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి నాగేంద్ర స్వామి వారి పుట్టలకు పాలు పోసి, స్వామివారికి అభిషేకాలు నిర్వహించి దర్శనమందుకున్నారు. స్వామివారి కృపకు పాత్రులైనట్లు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం నీటి సదుపాయాలు, స్వచ్ఛతా కార్యక్రమాలు, రాకపోకల ఏర్పాట్లు ఆలయ కమిటీ తరపున సమర్థంగా చేయబడ్డాయి. ఆలయ చైర్మన్ మల్యాల నరసింహారావు, వైస్ చైర్మన్ పూర్ణచంద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, మేనేజర్ పి.వి. రమణ ఆధ్వర్యంలో వేడుకలు విజయవంతంగా జరిగాయి. నాగుల చవితి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హారతులు, పంచామృతాభిషేకాలు నిర్వహించగా, ఆలయ వేద పండితులు స్వామివారికి మంత్రోచ్ఛారణలతో పూజలు చేశారు. భక్తులు “నాగేంద్ర హారాయ నమః” అంటూ భక్తి భావంతో నినాదాలు చేస్తూ స్వామివారి దర్శనాన్ని పొందారు. ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేయడం, చిన్నారుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆలయ పరిసరాలు పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించబడి పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. స్థానిక భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు కూడా పాల్గొని ఈ వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు.

## గ్రామగ్రామాన సిపిఐ శతవసంతోత్సవాలు జరపాలి

- డిసెంబర్ 26న ముగింపు ఉత్సవాలు పండువల జరుపుకుందాం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా




**కొత్తగూడెం,అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి ):** గ్రామగ్రామాన సిపిఐ శతవసంత ఉత్సావాలు సంబరంగా జరుపోకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక శేషగిరిభవన్'లో శనివారం జరిగిన లక్ష్మీదేవిపల్లి సిపిఐ మండల సమితి సభ్యుల సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 26నాటికి పార్టీ శత వసంతాలు పూర్తి చేసుకొంటోందని, ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో జెండా విష్కరణలు జరిపి పార్టీ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలన్నారు. ఖమ్మంలో 26న జాతీయ స్థాయి ముగింపు ఉత్సావాల బహిరంగ సభ జరగబోతోందని జిల్లా నుంచి లక్ష మందిని తరలించే దిశగా పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సభకు 40దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, మామిడాల ధనలక్ష్మి, రత్నకుమారి, దార శ్రీనివాస్, నూనావత్ గోవిందు, జక్కంపూడి వెంకటేశ్వర్లు,పూర్ణచందర్ రావు, శాపావత్ రవి, కళ్లెం సత్యనారాయణ, కుంజా రాంబాబు, దేవరగట్ల రాంబాబు, కరం జనార్దన్, వెంకటనర్సయ్య, మంద నిర్మల, మిర్యాల రాము, సంగం రాము, జర్పుల హరి, జర్పుల మురళి, ధనుంజయ్, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో నాలుగు గ్రామాల నుండి భారీ చేరికలు



**ఆళ్ళపల్లి. అక్టోబర్ 25 ప్రజాజ్యోతి :** శనివారం రాయిగూడెం గ్రామం లో ఏర్పాటు చేసిన సమావేశం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు. రాయిగూడెం గ్రామంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రాయిగూడెం,మైలారం,తునికుబండల, రామంజిగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీలనుండి 50కుటుంబాలు తాటి నాగేశ్వరరావు, తాటి భద్రయ్య, గొగ్గెల రాజబాబు, సాగబోయిన నారాయణల అధ్యారంలో బీఆర్ఎస్ పార్టీ లో రేగా కాంతరావు ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి. మాజీ జెడ్పిటిసి తదితరులు పాల్గొన్నారు కొమరం హనుమంతరావు కోపరేటివ్ చైర్మన్ గుగ్గల రామయ్య. మండల అధ్యక్షులు పాయం నరసింహారావు కొమరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ అడ్డుకున్న గ్రామస్తులు..

- ట్రాక్టర్ యాజమాని, గ్రామస్తులు మధ్య కోట్లాట...



**టేకులపల్లి,అక్టోబర్25,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో సంపత్ నగర్ సమీపంలోని పాలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు.గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం టేకులపల్లి మండలంలోని సంపత్నగర్ పాలవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ను గ్రామస్తులు అడ్డుకున్నారు.వాగు నుంచి రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్ను గ్రామస్తులు అడ్డుకోగా ఆపిన ఇసుక ట్రాక్టర్ యాజమాని ట్రాక్టర్ వద్దకు రావడంతో ఇరువురి మధ్య వాగ్వాదం, కొట్లాట చోటుచేసుకుంది. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న అధికారులు పట్టించు కోవాట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు,ప్రజా ప్రతినిధుల అండ దండలతోనే అక్రమ ఇసుక రవాణా సాగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు.బోడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



**ఆళ్ళపల్లి. అక్టోబర్25. ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలో పవిత్రమైన కార్తి మాసం కావడతో గ్రామాలలో నాగుల చవితి వేడుకలు ఘనంగా శనివారం జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పుట్టలో పాలు పోసి. నైవేద్యం సమర్పించి ఆ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.మహిళలు నాగుల చవితి వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు చిన్నారులు టపాసులు పేల్చి అందించారు ఈ కార్య క్రమంలో మహిళలు గౌరిశెట్టి భారతమ్మ. విజయ లక్ష్మి .మండలోజు సౌందర్య.అనుమోల సువర్ణ.సుజాత స్వరూప. రమ. లక్ష్మి .సరిత.అనిత. భవాని. ఇందిరమ్మ. ప్రశాంతి రమ్య దేవి పాల్గొన్నారు.

## కేయూ అథ్లెటిక్స్ లో ప్రియదర్శిని విద్యార్థికి మొదటి స్థానం



**కొత్తగూడెం,అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి ):** కాకతీయ యూనిర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అథ్లెటిక్స్ (క్రాస్ కంట్రీ) పోటీలో 10 కిలోమీటర్ల విభాగంలో స్థానిక ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బీకాం రెండవ సంవత్సరం చదువుతున్న మాలోత్ అఖిల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. త్వరలో జరగబోయే ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా అఖిల్ను కళాశాల ఆవరణలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నయీం పాషా మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఆలిండియా యూనివర్శిటీ పోటీలకు తమ కళాశాల నుండి మాలోత్ అఖిల్ ఎంపికైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాశిమల్ల రమేష్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

- ముఖ్య అతిథులుగా రేగ కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు
- దమ్మపేట సెంట్రల్ లైటింగ్ పనులపై రేగ కాంతారావు ఆగ్రహం
- ప్రజా సమస్యలపై మండిపడ్డ మెచ్చా నాగేశ్వరరావు



**దమ్మపేట, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు, అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ,బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు సూచనలతో, కేంద్ర బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ అధ్యక్షతన శనివారం దమ్మపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. జెండా ఆవిష్కరణ అనంతరం, దమ్మపేట జయలక్ష్మీ టాకీస్ సమీపంలో చిన్నపాటి తాకిడికి పడిపోయిన సెంట్రల్ లైటింగ్ స్థంభాన్ని రేగ కాంతారావు పరిశీలించారు. అదే మార్గంలో గుంతల వద్ద “గుంతలతో సెల్ఫీ” కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను ఎత్తిచూపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సుభిక్షంగా ఉన్న గ్రామాలు నేడు అవినీతిలో కూరుకుపోయాయని, స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. దమ్మపేట మండల కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి రూ. 5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు మంజూరు చేయించి 2023 లో ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత అసమర్థ ప్రభుత్వం నాసిరకపు పనులు చేస్తూ ప్రజా ధనాన్ని వృథా చేస్తోందని, రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా అభివృద్ధి పట్ల ద్రుష్టి చూపలేదని విమర్శించారు. వర్షాకాలంలో రోడ్లపై గుంతలు సహజమేనని, వాటిని పూడ్చడం ప్రభుత్వ బాధ్యత అని రేగ కాంతారావు పేర్కొన్నారు. ప్రజల సురక్షిత ప్రయాణానికి అడ్డంకిగా మారుతున్న ఈ గుంతలను వెంటనే పూడ్చాలని, సెంట్రల్ లైటింగ్ పనులను అధికారులు పర్యవేక్షించి ప్రజా ధనాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జున రావు, నియోజకవర్గ నాయకులు సోయ్యం విరభద్రం, మండల నాయకులు అంకత ఉమ మహేశ్వరరావు, జలగం వాసు, ఊప సర్పంచ్ దారా యుగుందర్, నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షులు రావుల శ్రీనివాసరావు, తుమ్మల లక్ష్మనరావు, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసుబాబు, యూత్ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, మండవ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్లు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు సత్తుపల్లి లో "మెగా జాబ్ మేళా"...

- ఏర్పాట్లు పరిశీలించిన డైరెక్టర్, ఎమ్మెల్యే, ఏరియా జీఎం





**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 25 – ప్రజాజ్యోతి:** సత్తుపల్లిలో రాణి సెలెబ్రేషన్స్ ఫంక్షన్ లో సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో, సత్తుపల్లి సింగరేణి సహకారం తో శనివారం ఉదయం 9:00 గంటల నుండి ప్రారంభం అయ్యే" మెగా జాబ్ మేళా " ఏర్పాట్లు ను సింగరేణి డైరెక్టర్ ( ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ ) కే వెంకటేశ్వర్లు, డాక్టర్ మట్టా దయానందు స్వయంగా పరిశీలించి, పలు సూచనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరై జీవనభృతికి అవసరమైన ఉద్యోగాలను పొందుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, పీజీ, ఫార్మసీ వంటి అర్హతలతో 18 నుండి 40 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు పాల్గొనవచ్చని, అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరయ్యేటప్పుడు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటోలు, వాటి జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలేం రాజుతో పాటు ఎస్ఓటు జిఎం జివి కోటిరెడ్డి, డిజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవీ.నరసింహారావు, జివిఆర్ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్ ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### డి ఏ బకాయిలు చెల్లించి

## పిఆర్సి ప్రకటించాలి

- టి ఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాథీరామ్.



**ఆళ్ళపల్లి. అక్టోబర్ 25. ప్రజాజ్యోతి:** ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఏ బకాయిలను చెల్లించి పిఆర్సి ని ప్రకటించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాథీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జడ్పీహెచ్ఎస్ మర్కోడు పాఠశాలలో ఆ సంఘం మండల అధ్యక్షులు అగ్గి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ పాఠశాలలకు తనిఖీ బృందాల పేరుతో ఉపాధ్యాయులను డిప్టేషన్పై తీసుకోవడం వల్ల ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందన్నారు పర్యావేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయకుండా ఉపాధ్యాయులని తనిఖీ పేరుతో తీసుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమీ లేదన్నారు. కాంప్లెక్స్ స్థాయి నుండి సిఆర్పిలు ఎంఈఓ లు డీఈవోలు ఖాళీలు భర్తీ చేసి పర్యవేక్షణ చూడాలన్నారు. ఇప్పటికే పాఠశాలలో ఆన్లైన్ పేరుతో ఉపాధ్యాయులపై పని భారం పెరిగి బోధనా సమయం వృధా అవుతుందన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్స్ పండిట్ పీటీల అప్గ్రేడేషన్ చేపట్టాలని కోరారు సిఆర్టి ల శాలరీలు వెంటనే విడుదల చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలుపరిష్కరించాలన్నారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల జీతాలు వెంటనే విడుదల చేయాలన్న.ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు డి నాగేశ్వరరావు జి వీరన్న బాబు ఈ సమ్మక్క శారదామని వేణు ప్రేమ్ కుమార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఒకరి రిమాండ్

- పరారీలో ముగ్గురు నిందితులు

**కొత్తగూడెం, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి ):** చుంచుపల్లి మండలం మర్రిగూడెం గ్రామం పెనగడప పంచాయతీలో ఈనెల 22 రాత్రి పద్దం నందయ్య(65) హత్యకు సంబంధించి ఫిర్యాదుదారుడు పెద్దం గౌతమ్ ఇచ్చిన ఫిర్యాది మేరకు నిందితుడు పోడియం రాము, తాపర్ల వెంకటేష్, అనిల్, ఉంగయ్య అనే నిందితులు మృతుడి ఇంటి ఆవరణలోకి చొరబడి హత్యకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం...నిందితుడు పొడియం రాము యొక్క కుమారుడు అనారోగ్య కారణాల వల్ల చనిపోయాడు, దానికి కారణం మృతుడు పద్దం నందయ్య, చేతబడి మంత్రాలు చేయడం వల్ల చనిపోయాడనే నెపంతో కక్ష కట్టి పై నలుగురు కలిసి కర్రలతో, గొడ్డలితో కొట్టి పద్దం నందయ్య హత్యా చేశారు, అనంతరం మృతుని శవాన్ని తీసుకొని వెళ్లి తెల్ల వాగులో పడేశారు. శనివారం కొత్తగూడెం డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో నిందితులలో ఒకడైన తాపర్ల వెంకటేష్ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి మూడు కర్రలను స్వాదినం చేసుకోని రిమాండ్ కు తరలించరు.